క్లుప్తంగా

సీఐని సత్కరించిన కాంగ్రెస్ నాయకులు



ఎల్కతుర్తి: ఎల్కతుర్తి సర్కిల్ కార్యాలయంలో ఇటీవలే నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన రమేశ్‌ను భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. సత్కరించిన వారిలో నాయకులు కొలుగూరి రాజు, ఆదరి రవీందర్, కిషోర్, మీస మహేష్, సురేష్, నరేందర్‌గౌడ్, కుమారస్వామి, కుడికందుల రాజు తదితరులు ఉన్నారు.

రుణమాఫీపై స్పష్టమైన ఉత్తర్వులివ్వాలి

ఐనవోలు : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణమాఫీపై స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలని బీజేపీ జిల్లా కార్యదర్శి గుండెకారి కోటేశ్వర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని గొప్పలు చెబుతూ రుణమాఫీ పేర రైతులను మోసం చేస్తుందన్నారు. రుణమాఫీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో అయోమయానికి గురవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల్లో ఒక స్పష్టతతో కూడిన ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎలాంటి స్పష్టత ఇవ్వకపోతే బీజేపీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

వైద్యాధికారిగా రాజశేఖర్

వేలేరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ రాజశేఖర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని పేద ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తానని అన్నారు. అలాగే పీహెచ్‌సీలో అవసరమైన మందులు, సౌకర్యాలు ఇతరత్రా అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపడతానని అన్నారు. కాగా గత కొన్నేళ్లుగా పీహెచ్‌సీలో రెగ్యులర్ డాక్టర్ లేకపోవడంతో ఇబ్బందులు పడిన మండల ప్రజలు ప్రస్తుతం వైద్యాధికారి రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వేలేరు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం రాజన్న ఆధ్వర్యంలో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల మధ్య చెత్తాచెదారం, మురుగునీరు నిల్వకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ కుమార్‌స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొడ్డలితో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన కోల సుమలతను అదే గ్రామానికి చెందిన గూళ్ల రాజు కోర్టులో తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెబితే నిన్ను చంపుతాని మూడు రోజుల క్రితం బెదిరించి గొడ్డలితో దాడికి యత్నించగా తన కుమారుడు కోల వెంకటేష్‌కు తలకు తీవ్రగాయమైంది. బాధితురాలు ఫిర్యాదు మేరకు దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



పబ్బు రాజు, అధ్యక్షుడు



రంజిత్‌కుమార్‌గౌడ్ ప్రధానకార్యదర్శి

కమలాపూర్: మండల కేంద్రంలోని లక్ష్మీ వెంకటేశ్వర కళామండలి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు ఈటల సమ్మయ్య తెలిపారు. అధ్యక్షుడిగా పబ్బు రాజు, ప్రధాన కార్యదర్శిగా కూనూరు రంజిత్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా పరకాల వీరస్వామి, గౌరవ అధ్యక్షులుగా తోడేటి చిన్న సదానందం, జక్కు రాజబోసు, తోడేటి రాజు, మార్క మొగిలి ఎన్నికయ్యారు.

ప్రమాదకరంగా యూ టర్న్

- డివైడర్ల మధ్యలో అస్తవ్యస్తంగా మొక్కలు
- దారి కనిపించకుండా ఫ్లెక్సీల ఏర్పాటు
- ఇబ్బందుల్లో వాహనదారులు



భూపాలపల్లి- హుజూరాబాద్ రోడ్డులో గుబురుగా పెరిగిన మొక్కలు



రోడ్డుపైనే సేద తీరుతున్న పశువులు

హన్మకొండ (పరకాల): ప్రధాన రోడ్డు మీద వాహనం నడపాలంటే వాహనదారుల్లో వణుకు పుడుతోంది. తాము చేయని తప్పులకు ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలో సుందరీకరణ కోసం డివైడర్ల మధ్యలో ఏర్పాటు చేసిన మొక్కలు, రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు వాహనదారులకు శాపంగా మారాయి. ఎలాంటి ప్రణాళిక లేకుండా మున్సిపాలిటీ సిబ్బంది తమ ఇష్టానుసారంగా డివైడర్ల మధ్యలో మొక్కలు నాటారు. వాస్తవానికి జంక్షన్‌లకు సమీపంలోని డివైడర్ల మధ్యలో మొక్కలు నాటకుండా యూ టర్న్ చేసే సమయంలో వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కానీ నేడు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మొక్కలతో పాటు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీలే ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఫ్లెక్సీలను నెలల కొద్ది ఉండడంతో వాహనదారులు యూటర్న్ తీసుకునే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. డివైడర్ల మధ్యలో ఏర్పాటు మొక్కలు పెరిగి వృక్షాలను తలపిస్తున్నాయి. దీంతో రోడ్డు దాటుతున్న క్రమంలో అవతలివైపు వచ్చే వాహనాలు దూసుకొచ్చి ఢీకొంటున్నాయి. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తుంది. మున్సిపల్ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నడిరోడ్డుపైనే సేద తీరుతున్న పశువులు

పట్టణంలో నడిరోడ్డుపైనే పశువులు సేద తీరటం కూడా వాహనదారులకు ఇబ్బందికరంగానే ఉన్నాయి. కనీసం కదలలేని స్థితిలో ఉంటూ కొన్ని.. ఉన్నట్టుండి కొన్ని పరుగులు పెడుతుండడంతో వాహనదారులకు ఏమి తోచక భయభ్రాంతులకు గురై ప్రమాదాల బారిన పడాల్సిన దుస్థితి నెలకొంది.

ఏపుగా పెరిగిన మొక్కలు



హనుమకొండ-భూపాలపల్లి రోడ్డు, వెల్లంపల్లి రోడ్డులోని యూటర్న్‌లు ప్రమాదకరంగా ఉన్నాయి. యూటర్న్ ఉన్న చోటే మొక్కలు గుంపులుగా ఉన్నాయి. దీంతో అవతలి నుంచి వస్తున్న వాహనాలు దగ్గరికి వచ్చే వరకు కనిపించడం లేదు. అధికారులు గుర్తించి తొలగించాలి.

– ఎస్.కె మోయిన్, వ్యాపారి, పరకాల

ఫ్లెక్సీలు పెడితే తొలగిస్తాం



వాస్తవానికి జంక్షన్లు, యూటర్న్‌ల వద్ద ఎలాంటి ఫ్లెక్సీలు ఉన్న ప్రమాదమే. యూటర్న్‌లు, జంక్షన్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే తీసి వేయిస్తాం. అదే విధంగా యూటర్న్‌ల వద్ద ప్రమాదాలకు కారణమవుతున్న మొక్కలను తక్షణమే తొలగిస్తాం.

– కె.నర్సింహా, మున్సిపల్ కమిషనర్, పరకాల

ఎమ్మెల్యే 'రేవూరి'తోనే అభివృద్ధి సాధ్యం

- మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి

పరకాల: గత పాలకుల కారణంగా అభివృద్ధికి నోచని పరకాల నియోజకవర్గాన్ని స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి కొనియాడారు. అభివృద్ధే లక్ష్యంగా పనిచేసే ఎమ్మెల్యేను పరకాల ప్రాంత ప్రజలు ఎన్నుకోవడం గర్వంగా ఉందని ఆయన అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలో పెండింగ్ పనులపై దృష్టి సారించడంతో పాటు నియోజకవర్గ ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్నారని అన్నారు. 2 లేన్ల కంఠాత్మకూర్ వంతెనను 4 లైన్లుగా విస్తరించడంతో పాటు గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీల అభివృద్ధి, రూ.11 కోట్లతో అమృత్ పథకానికి ప్రారంభోత్సవం చేయడం జరిగిందన్నారు. షిఫ్ట్ పద్ధతిలో జరుగుతున్న విద్యావ్యవస్థలకు సమూలంగా మార్పులకు రూ.5కోట్ల నిధులతో డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను మంత్రి శ్రీనివాస్‌రెడ్డితో ప్రారంభం చేయించినట్లు తెలిపారు. అదే విధంగా టెక్స్‌టైల్ పార్కులో కొత్త కంపెనీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పాడి కల్పనాదేవి, మాజీ ఎంపీపీ ఒంటేరు రాంమూర్తి, కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్, నాయకులు పావుశెట్టి వెంకటేశ్వర్లు, మేరుగు శ్రీశైలం, మడికొండ శ్రీను, ఎం.డీ రంజాన్ అలీ, పబ్బ శ్రీను, ఒంటేరు శ్రావణ్, దుబాసి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ



పేషెంట్‌ను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న విజయ్‌కుమార్

ఐనవోలు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయ్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలు గురించి ఆరా తీశారు. జాతీయ కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఇన్, ఔట్ పేషెంట్ల వివరాల అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెడికల్ ఆఫీసర్, సిబ్బందితో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సరైన మందులను ఇవ్వాలన్నారు. అవసరముంటేనే ఇన్‌పేషెంట్‌గా తీసుకుని వైద్యం అందిచాలన్నారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలపై డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సంతృప్తి వ్యక్తం చేసినట్లు మెడికల్ ఆఫీసర్ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన వెంట సీహెచ్‌ఓ సునంద, స్వరూప, సరిత, రోజా, సుజాత, భాస్కర్, నవీన్, శ్రీకాంత్ ఉన్నారు.

వైభవంగా ఆలయంలో ప్రత్యేక పూజలు

- నేడు పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



ఆంజనేయస్వామి దేవాలయం నుంచి దేవతామూర్తుల పటాలను తీసుకొస్తున్న భక్తులు



పోచమ్మతల్లి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

దామెర: మండల కేంద్రంలోని పోచమ్మ దేవాలయం పునర్నిర్మాణంలో భాగంగా రెండో రోజు మంగళవారం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలను అర్చకులు ఆసం సుర్యనాచారి, కిష్టోజు రవీంద్రాచారి, ఉప్పునూతల శ్రీధరాచారి, కిష్టోజు అనిల్‌చారి, సుధాకర్‌చారి వేదమంత్రాల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సమస్తదేవతా ఆరాధన, సర్వతోభద్రమండల, ఉపమండల ఆవాహనము, పోచమ్మ దేవత అభిషేకం, మూర్తిహోమం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ధాన్యాధివాసం, పుష్పాధివాసం, ఫలాధివాసం, శయ్యాధివాసం, అష్టదిగ్బంధన, మంత్ర పుష్పం, కుంకుమార్చన, అష్టలక్ష్మీ పూజలు నిర్వహించారు. విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం కోలాహలంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య గ్రామంలోని వీధుల్లో ఊరేగించగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలుకుతూ బిందెలతో నీళ్లుపోశారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం(నేడు) పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, శివం ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి, పోల్సాని అనిల్‌రెడ్డి, గంగిడి శ్రీధర్ రెడ్డి, ఎస్ఆర్ఐ ఎర్ర స్వప్నరెడ్డి, మేరుగు కుమార్, దుర్గనాల యోగేశ్వర్ ఆలయన కమిటీ చైర్మన్ తాటికొండ రాజేందర్, సభ్యులు తాటికొండ భద్రయ్య, శ్యామ్, భిక్షపతి, అశోక్, శంకర్ పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల బాధ్యతల స్వీకరణ



రాకేష్, దామెర ఏఓ



లలిత, వేలేరు ఏఓ

దామెర : మండల వ్యవసాయ అధికారిగా ఏ.రాకేష్ దామెరకు బదిలీపై వచ్చారు. కాగా మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. రాకేష్ గూడూరు మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహించారు. గత కొంతకాలంగా దామెర ఏఓగా పనిచేసిన డేంగు శ్రీనివాస్ పరకాల ఏడీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. అదే విధంగా దామెర ఏఈఓగా బి.జగదీష్, పసరగొండకు వి.రామకృష్ణ, ఊరుగొండకు సీహెచ్. అరుణ్‌కుమార్ బదిలీపై రాగా బాధ్యతలు స్వీకరించారు.

వేలేరు : మండల వ్యవసాయ అధికారిగా ఏ.లలిత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక చొరవ చూపుతానని అన్నారు. అలాగే వేలేరు క్లస్టర్ ఏఈఓగా రాజశేఖర్, పీచర ఏఈఓగా విజయ్‌కుమార్‌లు కూడా బాధ్యతలు చేపట్టారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న ఎస్సై పస్తం శ్రీనివాస్

ఐనవోలు: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. సోమవారం రాత్రి సాధారణ తనిఖీలు చేపడుతుండగా మండలంలోని కక్కిరాలపల్లిలో ఏపీ 36 టీబీ 1695, టీఎస్ 03 యూసీ 0815 నంబర్లు గల ఆటోల్లో మద్యం రవాణా అవుతున్నట్లు గుర్తించారు. ఆటోలు ఆపి తనిఖీలు చేపట్టగా మద్యం రవాణాకు ఎలాంటి అనుమతులు లేవు. దీంతో రెండు ఆటోలతో పాటు రూ.2,22,480 విలువగల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఆటోల్లో అక్రమంగా తరలిస్తున్న కంఠాత్మకూర్‌కు చెందిన గుడికందుల రమేష్, పంథినికి చెందిన సట్ల హరీష్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. మంగళవారం కక్కిరాలపల్లిలో ఎల్లమ్మ దేవత వంటలు ఉండటంతో పంథిని వైన్స్ షాపు నుంచి కక్కిరాలపల్లి గ్రామంలోని బెల్ట్ షాపులకు మద్యం తరలిస్తున్నట్లు నిందితులు తెలిపారు. వైన్స్ షాపు యజమానితో పాటు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు



పరకాలలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హన్మకొండ (పరకాల): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పాడి కల్పనాదేవి, మాజీ ఎంపీపీ ఒంటేరు రాంమూర్తి, కౌన్సిలర్స్ పంచగిరి జయమ్మ, మడికొండ సంపత్‌కుమార్, నాయకులు గోనాథ్, భాస్కర్, బొమ్మకంటి చంద్రమౌళి, సాంబయ్య పాల్గొన్నారు.

శాయంపేట : దేశం కోసం రాజీవ్‌గాంధీ చేసిన సేవలు చారిత్రాత్మకమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. నాయకులు చిందం రవి, మార్కండేయ, కుమారస్వామి, రాజిరెడ్డి, రవీందర్, వలిహైదర్, మార్కండేయ, ప్రపంచరెడ్డి, రాజు, కట్టయ్య, వీరన్న, చిరంజీవి పాల్గొన్నారు.

ఎల్కతుర్తి: రాజీవ్‌గాంధీ 80వ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు మంగళవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని బస్టాండ్ సమీపం వద్ద గల అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూ లమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి ప్రయాణికులకు పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అయిలయ్య, రవీందర్, అశోక్ ముఖర్జీ, రాజు, ప్రకాష్, స్వరూప, శారద పాల్గొన్నారు

ఎల్కతుర్తిలో సీఎం రేవంత్‌రెడ్డికి క్షీరాభిషేకం



ఎల్కతుర్తిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంవద్ద కాంగ్రెస్ నాయకులు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, సుకినే సంతాజీ, గోలి రాజేశ్వర్‌రావు, మహేందర్, సుమన్‌గౌడ్, పాక రమేష్, శనిగరం వెంకటేష్ పాల్గొన్నారు.



శాయంపేట : రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



ఎల్కతుర్తి : ముల్కనూర్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

'ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం'

శాయంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో విఫలం చెందిందని, రుణమాఫీ కాకపోవడంతో రైతులు అయోమయంలో పడుతూ బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ ప్రభుత్వంపై మండిపడ్డారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతూ కాలం వెళ్లదీస్తుందన్నారు. అధికారం చేపట్టిన ఎనమిది నెలలు అవుతున్న ఇప్పటివరకు కొంత మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని, ఇందిరమ్మ ఇండ్ల ఊసేలేదన్నారు. కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం ఏమైందని, గృహలక్ష్మి పథకంలో మహిళలకు నెలకు రూ.2500 పంపిణీ ఎక్కడ ప్రారంభించారని ప్రశ్నించారు. ధరణి పోర్టల్‌ను భూమాతగా మార్చినప్పటికి భూ సమస్యల పరిష్కారం మాత్రం జరుగలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ సర్పంచ్ అరికిళ్ల ప్రసాద్, నాయకులు రమేష్, భరత్, వెంకట్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఇష్టానుసారంగా పార్కింగ్



పరకాల పట్టణంలోని జయ డీలక్స్ రోడ్డులో ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేసి రాజధాని టీ ప్యాలెస్ వద్ద టీ తాగుతూ ముచ్చట్లు పెడుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – హన్మకొండ (పరకాల)

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : క్రాంతికుమార్, సీఐ పరకాల
ఫోన్‌నంబర్ : 87126 85224

డిప్లొమా కోర్సును సద్వినియోగం చేసుకోవాలి

- చేనేత, జౌళిశాఖ వరంగల్ ప్రాంతీయ ఉప సంచాలకులు రాఘవరావు



మాట్లాడుతున్న రాఘవరావు

కమలాపూర్: టెక్స్‌టైల్స్ టెక్నాలజీ డిప్లొమా కోర్సును చేనేత కుటుంబాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చేనేత, జౌళిశాఖ వరంగల్ ప్రాంతీయ ఉప సంచాలకులు రాఘవరావు సూచించారు. కమలాపూర్‌లోని చేనేత సహకార ఉత్పత్తి, వి క్రయ సంఘంలో మంగళవారం చేనేత కార్మికులకు వారి కుటుంబాల్లోని విద్యార్థులకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) ప్రవేశాలకు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ఐఐహెచ్‌టీ కోర్సు ప్రారంభించిందని తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఆసక్తి గల చేనేత విద్యార్థులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోందని పేర్కొన్నారు. మొదటి సంవత్సరంలో 60 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కోర్సు 3 సంవత్సరాలు (6 సెమి స్టర్లు) ఉంటుందని, ఈ నెల 31 దరఖాస్తులకు చివరి గడువు అని, ఆసక్తి గల విద్యార్థులు tsht. telang ana. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కోర్సు, ఉపాధి అవకాశాలకు సంబంధించి చేనేత, జౌళిశాఖ హనుమకొండ జిల్లా ఏడీ ఎం.విజయలక్ష్మి అవగాహన కల్పించారు. చేనేత, జౌళిశాఖ డీఓలు వెంకటేశ్వర్లు, అనిత, ఏడీఓ సునీత, సంఘ మేనేజర్ సామల దామోదర్, చేనేత కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌కుమార్ గెలుపు హర్షణీయం

శాయంపేట : తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల్లో వల్లకటి రాజ్‌కుమార్ అత్యధిక మెజార్టీతో గెలిచారని ఆయన గెలుపు హర్షణీయం అని మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని చేనేత సొసైటీలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్ష ఎన్నికల్లో 27,154 ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోగా 161 చెల్లని ఓట్లుగా ఎన్నికల అధికారులు నిర్ధారించగా మిగిలిన 26,967 ఓట్లలో రాజ్‌కుమార్‌కు 20,197 ఓట్లు రాగా సమీప అభ్యర్థి బూర మల్లేశంకు 6,796 ఓట్లు మాత్రమే వచ్చాయన్నారు. సమావేశంలో మా జీ సర్పంచ్ కందగట్ల రవి, నాయకులు బాసాని లక్ష్మీనారాయణ, సామల రవీందర్, బాసాని సదాశివుడు, వెంకటేశ్వర్లు, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కమలాపూర్: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకుని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక సీఐ హరికృష్ణ తెలిపారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన చందుపట్ల శ్రీధర్‌రెడ్డి, ఉడుత కుమార్, కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడేనికి చెందిన బత్తిని కుమార్, గిరిమల్ల రాజేష్ నా లుగు ట్రాక్టర్లలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు అంబాల వద్ద ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద ఇసుక తరలింపుకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.